ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చివరి సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం రాణిస్తూ సమాజంలో గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు.



అనుదినం జనపక్షం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

1

బుధవారం 03 మే 2023

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

మండలంలోని మస్కాపూర్ గ్రామ శివారులో పనులు నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలకు మంగళవారం పెంబి జడ్పీటిసి భుక్య జానుబాయి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజాసేవలో భాగంగా ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమకు సకాలంలో డబ్బులు అందట్లేదని కూలీలు మొరపెట్టుకోగా అండగా ఉండి డబ్బులు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట బిజెపి, బీజేవైఎం నాయకులు ఉన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నవతెలంగాణ - భీమిని

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బారాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు, రికార్డుల నిర్వహణ అంశాలపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ ఆర్ఎస్ పద్మ, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, ఉమా శంకర్, భీమిని, కన్నెపల్లి మండలాల ఆశా కార్యకర్తలు, ఏఎంఎంలు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులతోనే బొగ్గు తీయించాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో సింగరేణి కార్మికులతోనే బొగ్గును తీయించాలని ఖైరిగూడ ఓసీ ఈపీ ఆపరేటర్లు మంగళవారం గని మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈపీ ఆపరేటర్లు మాట్లాడుతూ ఖైరిగూడ ఓసీలో చవల్స్ అందుబాటులో ఉన్నాయని, సింగరేణికి ఉన్న మిషనరీ సామర్థ్యంతో క్వారీ నుండి బొగ్గును తీయగలమని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ప్రయివేటు కాంట్రాక్టర్‌తో కాకుండా సింగరేణి కార్మికులతోనే బొగ్గు తీయించాలని తెలిపారు. సింగరేణి యాజమాన్యం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ కార్నాదం వెంకటేశం, ఈపీ ఆపరేటర్లు బొంగు వెంకటేశ్, మారిన వెంకటేశ్వర్లు, బి చంద్రశేఖర్, శంకర్, రమేష్, రాజేష్, కుమార్, కిరణ్, కుమారస్వామి పాల్గొన్నారు.

రోడ్లపై తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు చేస్తే కఠినచర్యలు

నవతెలంగాణ-నిర్మల్

రోడ్లపై తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు చేస్తే కఠినచర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు రోడ్డును ఆక్రమించి పండ్లు విక్రయిస్తున్న తోపుడు బండ్లను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ మాట్లాడుతూ పట్టణ సీఐ ఆదేశాల మేరకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టినట్లు చెప్పారు. రోడ్లపై వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. ఇందులో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల కిట్ల పంపిణీ



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండల కేంద్రంలో మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల కిట్లను ఎస్సై గుంపుల విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. మంగళవారం మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు అనాథ బాలునికి రూ.1000 ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత సేవ చేయడంలో ముందుండాలని, మా ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువులు అందజేత



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

మండలంలోని చాంద(టి) గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం ప్లేట్లు, మ్యాట్లు పంపిణీ చేశామని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కోకన్వీనర్ దుమాల అశోక్ తెలిపారు. అనంతరం అంకోలి గ్రామంలో మే డే రోజు సీఎం కేసీఆర్ కార్మికులకు రూ.1000 పెంచడంతో కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్యే జోగు రామన్నకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో చాంద(టి) గ్రామ భవనిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు భగత్, విట్టల్, ఆనంద్, దత్తు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

మండలంలోని గోసంపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు నిర్వహించిన దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులతో పాటు రూ.4వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ రవినాయక్, మధుకర్, సుధీర్ పాల్గొన్నారు.

టికెట్‌పై ఎవరి ధీమా వారిదే..!

- పోటాపోటీ ప్రచారంలో ఎమ్మెల్యే రేఖానాయక్, బుక్యా జాన్సన్ నాయక్
- అధినేత ఆశీర్వాదం ఎవరికో..?



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన రేఖానాయక్, జాన్సన్‌నాయక్(ఫైల్)

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ టికెట్‌పై ప్రధానంగా ఇద్దరు నాయకుల మధ్యనే పోటీ కనిపిస్తోంది. ఎమ్మెల్యే రేఖానాయక్ మూడో సారి కూడా తనకే టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకుంటుండగా, పార్టీ అధిష్టానం ఈసారి ఖానాపూర్ టికెట్ తనకే ఇస్తుందని జాన్సన్ నాయక్ ధీమాతో ఉన్నారు. వీరిద్దరూ తమ అనుచరులతో విడివిడిగా గ్రూపులు ఏర్పాటు చేసుకొని నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతున్నారు. పార్టీ కార్యకర్తలను తమవైపు తిప్పుకోవడంలో జాన్సన్ నాయక్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని చర్చ కొనసాగుతోంది. మొన్నటి వరకు ఎవరో తెలియని జాన్సన్ నాయక్ పేరు ఇప్పుడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వినిపిస్తోంది. నియోజకవర్గంలో ఈ సారి పార్టీ టికెట్‌ను నలుగురు ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఖానాపూర్ అసెంబ్లీ టికెట్ మూడోసారి కూడా తనకే వస్తుందని ఎమ్మెల్యే రేఖానాయక్ గంభీరంగా చెబుతుంటే, బుక్యా జాన్సన్ నాయక్, పూర్ణానాయక్, శర్మన్ నాయక్ తమకే టికెట్ వస్తుందన్న ఆశతో ఉన్నారు. వీరిలో ప్రధానంగా ఎమ్మెల్యే రేఖానాయక్, జాన్సన్ నాయక్ మధ్యనే పోటీ కనిపిస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్‌కు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉండి నియోజకవర్గం ప్రజలతో సంబంధాలున్నాయి. అదే స్థాయిలో ఆమె పనితీరు పట్ల పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో వ్యతిరేక భావం కూడా ఏర్పడిందని ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. కేవలం ఆమె చుట్టూ పరిభ్రమించే ఓ నలుగురు అనుచరులకు తప్ప ఇతరులను ఏనాడూ పట్టించుకోరన్న విమర్శలున్నాయి. ఇంతకాలం ఆమె వ్యవహరించిన తీరే ఇప్పుడు జాన్సన్ నాయక్‌కు కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఉపయోగించుకొని జాన్సన్ నాయక్ పార్టీ కార్యకర్తలను తనవైపు తిప్పుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో రేఖానాయక్ తనపై ఘాటైన విమర్శలు చేసినా కూడా వాటికి ప్రతిస్పందించకుండా జాన్సన్ నాయక్ మౌనంగానే ఉంటూ కార్యకర్తలతో మమేకమై తన ప్రచారాన్ని సాఫీగా సాగిస్తున్నాడు. మొన్న జరిగిన ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్యే రేఖానాయక్ చేసిన విమర్శలు స్థానికంగా చర్చకు దారితీశాయి. పండుగ రోజున యాచకుడు వచ్చినట్టు ఉద్యమ నేపథ్యం లేనోడు టికెట్ కోసమని పార్టీలో గ్రూపులు కడ్తున్నాడంటూ ఆమె చేసిన ఘాటు వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహం కలిగించినట్టు జాన్సన్ నాయక్ అనుచరులు చెబుతున్నారు. పార్టీ అధినేతల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేయించడం, రంజాన్ పండుగ రోజున జాన్సన్ నాయక్ మైనార్టీలను కలిసేందుకు వచ్చిన సందర్భంలో రేఖానాయక్ మాట్లాడిన తీరు విమర్శలకు దారి తీసింది. ఆమె చేసిన స్వయం కృతాపరాధ పరిణామాలే ఆమెకు నష్టం కలిగిస్తాయన్న ప్రచారం జరుగుతోంది. వీరిదరి మధ్యన కొనసాగుతున్న అంతర్యుద్ధ సమాచారమంతా అదిష్టానం వద్ద ఉన్నట్లు తెలుస్తోంది.

వివాహేతర సంబంధంతోనే జంట హత్యలు

- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ
- నలుగురిపై కేసు
- ప్రధాన నిందితుని అరెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల గుడిహత్నూర్ మండలం సీతాగోంది శివారులో కలకలం రేపిన జంట హత్య కేసును పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ పోలీస్‌హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. కేఆర్‌కే కాలనీకి చెందిన సోన్‌కాంబ్లే ఆశ్వినికి సుందరయ్యనగర్‌లో నివాసముండే రమేష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సజావుగా సాగుతున్న కాపురంలో వివాహేతర సంబంధం చిచ్చురేపింది. అశ్విని కొంతకాలంగా ఎండి.రహమాన్‌తో సన్నిహితంగా మెలగడం భార్యాభర్తల మధ్య గొడవలకు దారితీసింది. దీంతో ఆమె మూడు నెలల నుండి తన పుట్టింట్లోనే ఉంటోంది. అయినప్పటికీ ఆమెలో మార్పు రాలేదు. మళ్లీ రహమాన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరగడంతో కోపోద్రిక్తుడైన భర్త రమేష్ తన చెల్లెలు స్వప్న, బావ వెంకటేష్, శీలతో కలిసి హత్యకు కుట్ర పన్నాడు. ఎలాగైనా వారిని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఏప్రిల్ 28న ఉదయం రమేశ్ తన కుమారుడు లోకేశ్‌తో కలిసి కేఆర్కే కాలనీకి వెళ్లారు. ఆ రోజు ఉదయం 9గంటలకు తాను కిరాయికి తీసుకున్న ఇల్లు శుభ్రం చేయడానికి భార్య ఆశ్విని వస్తుందని ఎదురు చూశాడు. మామకు ఉదయం 10 గంటలకు ఫోన్ చేయగా ఆమె బయలుదేరి చాలాసేపు అయిందని చెప్పగా రమేశ్‌కు అనుమానం వచ్చింది. రమేశ్ తన కొడుకు లోకేష్‌ను పిలిచి వారం రోజుల క్రితం అమ్మ ఎక్కడికి పోయిందో నీకు గుర్తుందా అని అడుగగా కొడుకు గుర్తుందని చెప్పాడు. కొడుకును తీసుకొని ఆటోలో కొడుకు చెప్పిన ప్రకారంగా ఆదిలాబాద్ నుండి సీతాగోందికి వచ్చారు. అక్కడ నుండి గర్కంపేట్ గ్రామానికి 2కిలో మీటర్ల వరకు వెళ్లారు. రోడ్డుపై కుడి వైపు వేప చెట్టు కింద స్కూటీ కనబడగానే ఇంతకుముందు వచ్చిన స్కూటీ ఇదే అని లోకేష్ తండ్రి రమేశ్‌కు చూపించాడు. రమేష్ స్కూటీ నిలిపి ఉన్న ప్రదేశం నుండి కుడి వైపు కొంత దూరం వెళ్లి వెతుకుతుండగా పొదలలో భార్య వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉన్నది చూశాడు. వెంటనే ఇద్దరు చెల్లెళ్లకు, బావకు ఫోన్ చేసి పిలిచాడు. స్వప్న ఓ ఆటోలో, శీల తన భర్త వెంకటేష్‌తో కలిసి మరో ఆటోను కిరాయికి తీసుకొని ఆదిలాబాద్ నుండి రమేశ్ వద్దకు వచ్చారు. అందరూ కలిసి ఎండి రహిమాన్, అశ్విని కలిసి ఉండడం చూసి ఎలాగైనా వారిని చంపాలని నిర్ణయించుకున్నారు. అక్కడ ఉన్న కర్రను రమేశ్ తీసుకొని వారు సానిహితంగా ఉన్న సమయంలో వెనుక వైపు నుండి రహిమాన్ తలపై కొట్టి చంపాడు. అశ్విని అక్కడి నుండి పారిపోతుండగా చెల్లెండ్లు, బావ పట్టుకొనగా రమేశ్ నొదటిపై, తల వెనుక భాగంలో బలంగా కర్రతో కొట్టి చంపాడు. ఇటీవల వీరి మృతదేహాలు బయటపడడంతో పోలీసులు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. స్వయంగా ఎస్పీ ఘటనాస్థలిని పరిశీలించి క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ సాయంతో కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసు అధికారులతో ఆరు టీమ్‌లను ఏర్పాటు చేసి త్వరగానే కేసును ఛేదించారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. కేసును 2రోజుల్లో ఛేదించి నేరస్తున్ని అరెస్ట్ చేశారు. కేసును ఛేదించడంలో ముఖ్యపాత్ర పోషించిన పోలీసులందరినీ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో ఉట్నూర్ డిఎస్పి సిహెచ్ నాగేందర్, ఇచ్చోడ సీఐ ఎం నైలు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఈ చంద్రమౌళి, గుడిహత్నూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్, సిరికొండ ఎస్సై నీరేష్, నేరడిగొండ ఎస్సై సాయన్న పాల్గొన్నారు.

ఐదో రోజుకు పంచాయతీ కార్యదర్శుల సమ్మె

- జిల్లా కేంద్రంలో ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహానికి వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినందున వెంటనే తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శిబిరం నుండి కలెక్టర్‌చౌక్, ఎన్టీఆర్ చౌక్, బస్టాండ్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తమ కష్టం ఫలితంగానే ఎన్నో జాతీయస్థాయి అవార్డులు తెలంగాణకు దక్కుతున్నాయని అన్నారు. కానీ ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గత్యంతరం లేకనే సమ్మెకు పూనుకున్నామని, ప్రభుత్వంపై కక్షసాధింపుతో కాదని స్పష్టం చేశారు. తమకు రావాల్సిన బెనిఫిట్స్ అందజేసి తమకు న్యాయం చేయాలన్నారు. అలాగే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుని బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం దిగొచ్చేవరకూ సమ్మెను విరమించే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నిర్మల్ నుంచి రాజోలుకు సూపర్‌లగ్జరీ బస్సు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ డిపో నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలుకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్. సాయన్న తెలిపారు. నిర్మల్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బస్సు బయలు దేరి హైదరాబాద్, విజయవాడ, గుడివాడ, ముదునేపల్లి, భీమవరం, పాలకొల్లు మీదుగా రాజోలుకు మరుసటి రోజు ఉదయం 5గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం 7గంటలకు రాజోలు నుంచి బయలు దేరి విజయవాడ, హైదరాబాద్ మీదుగా నిర్మల్‌కు ఉదయం 10.35 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని తెలంగాణ, ఆంధ్ర ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

ప్రతి పౌరుడికి రాజ్యాంగాన్ని అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారతదేశంలో ఉన్న పౌరులందరికీ భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని, ఆ గ్రంథంపై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. మంగళవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముందు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశాన్ని నడిపిస్తోందని భారత రాజ్యాంగమేనని, ఆ గ్రంథం పట్ల నూటికి 90శాతం ఉన్న ప్రజలకు అవగాహన లేదని పేర్కొన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ విఫలం కావడానికి భారత రాజ్యాంగంపై అవగాహన లేకపోవడమేనని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి అందించాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇతర దేశాలలో ఆ దేశ రాజ్యాంగాన్ని ప్రజలందరికీ తెలియపరచి తద్వారా పొందుతున్న హక్కులను వివరిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భారత రాజ్యాంగం అమలుపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, ప్రభుత్వాలు దిగివచ్చి వెంటనే ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగ గ్రంథాన్ని అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, జిల్లా నాయకులు, వివిధ మండలాల నాయకులు చిట్యాల శ్రీనివాస్, వెంకటేష్, రాంచందర్, కరాటి గంగన్న, రాజేశ్వర్, శేఖర్, పవన్, రాజీవ్, అశోక్, లక్ష్మణ్, ఓమన్న, అనిల్, నవీన్, మంజూష, లక్ష్మి, శ్రీవాణి, శ్యామల, సుష్మ, సంతోష్, రమేష్, అరవింద్, విష్ణు, దేవన్న, సురేష్, అమూల్ పాల్గొన్నారు.

మేడు స్ఫూర్తితో కార్మికులంతా ఉద్యమించాలి



నవతెలంగాణ-నిర్మల్

138వ మేడే స్ఫూర్తితో కనీస వేతనాలు పెంపుదల, సామాజిక భద్రత, పని గంటలు తగ్గింపునకు కార్మికులంతా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె. రాజన్న పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్మల్ రూరల్ మండలంలోని కడ్తాల్ బీడీ ఫ్యాక్టరీ ముందు 138వ మే డే వారోత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు నిలుపుదల చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు నిలిపివేయాలని, వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పేర్కొన్నారు. 1886 చికాగో నగరంలో కార్మికులు ఆనాడు పోరాడి సాధించిన హక్కులను మన ఓట్లతో గెలిచిన మన దళారి పాలకులు కాలరాస్తున్నారన్నారు. కొత్తగా హక్కులు కల్పించకపోగా ఉన్న హక్కులను, తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి, ఉత్తమ్, మురళీ, చిన్నయ్య, రాజు, శ్రీనివాస్, శ్రీను, రాము, రవి , నరసవ్వ, జమున, లక్ష్మీ, అరుణ, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

16వ రోజుకు వీఓఏల సమ్మె



నవతెలంగాణ - కాగజ్‌నగర్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు చేపడుతున్న సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరింది. సమ్మె చేస్తున్న వివోఏలకు మద్దతుగా మండల సమైక్య ఓబీలు, గ్రామ సంఘాల ఓబీలు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రతి సంఘం పూర్తి మద్దతు ఉంటుందన్నారు. వీవోఏలు చేస్తున్న సమ్మె పూర్తి న్యాయమైనదని కనీస వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆడిట్ నిర్వహించాలని సమ్మెలో ఉన్న వారిపై ఒత్తిడి చేయొద్దని ఏపీఎం ముక్తేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్, గ్రామ సమైక్య సభ్యులు తార, ఆసియా గులాబీ, కవిత, వినోద్, ఎన్ మహేశ్వరి, సిరిశెట్టి శ్రీనివాస్ గౌడ్, వనిత, ధనరాజ్, కళ్యాణి, రజిత, అంజలి పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటస్వామి

నవతెలంగాణ-నిర్మల్



తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుంటోల్ల వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘ వ్యవస్థాపకుడు జేబీ రాజు సారథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ అవిలయ్య, ప్రధాన కార్యదర్శి నాగరాజు, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ బి.నర్సింగరావు వెంకటస్వామికి పదవి స్వీకార పత్రాన్ని అందజేశారు. వెంకటస్వామి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సంఘాలను బలోపేతం చేస్తూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
బుధవారం 03 మే 2023

గ్రామ పంచాయతీకి తాళం వేసి నిరసనకు మద్దతు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మునిపెల్లి గ్రామ పంచాయతీకి మంగళవారం తాళం వేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. ఇదివరకు పనిచేసిన పంచాయతీ కార్యదర్శి తిరిగి వచ్చేంతవరకు తాళం తీయమని స్పష్టం చేశారు. మునిపెల్లి జూనియర్ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి సమ్మెలో ఉన్నందున మల్లాపూర్ గ్రామపంచాయతీ రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పామని ఎంపీడీఓ శేఖర్ తెలిపారు. తాళం వేసి మద్దతు తెలిపిన వారిలో స్థానిక సర్పంచ్ కమల్ కోట పద్మ వెంకట్‌రెడ్డి, వార్డు మెంబర్ ఆరుట్ల రాజారెడ్డి, గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్‌లు ఆరే హరీష్, గొర్రె గంగన్న, గొర్రె ముత్తన్న ఉన్నారు.



ఐకేపీ వీఓఏల భిక్షాటన

నవతెలంగాణ-తాంసి

ఐకేపీ వీఓఏ గత పదిహేను రోజులుగా తమ న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు మండల కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు గ్రామంలోని వీధులు తిరుగుతూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏ మండల అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టు కొస్తున్నామని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఐకేపీలో పని చేయడం జరుగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ తమ న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, శ్రీనివాస్, పుష్పలత, దేవన్న, మహేందర్, పలువురు ఉన్నారు.



వంతెన నష్టం.. ఎన్నాళ్లీ కష్టం..!

- నిర్మించిన ఏడాదిలోపే కూలిపోయిన బ్రిడ్జి
- ప్రమాదకరంగా కడెం వాగుదాటుతున్న జనాలు
- పండించిన పంటను అమ్మేందుకు తంటాలు

చిరకాల స్వప్నం నెరవేరింది అనుకున్న ఏడాదిలోపే వంతెన స్లాబు కొట్టుకుపోయింది. వరద తాకిడికి తట్టుకోలేక వంతెన కొట్టుకుపోవడంతో జనాలు అష్టకష్టాలు పడుతున్నారు. సరకుల కొనుగోలుకు..పంటను అమ్ముకునేందుకు తంటాలు పడాల్సి వస్తోంది. ప్రమాదకరంగా కడెం వాగును దాటుతూ అవస్థలు పడుతున్నారు. పెంబి గ్రామ సమీపంలో కడెం వాగుపై రూ.168.20కోట్లతో నిర్మించిన ఈ వంతెన ఏడాదిలోపే కొట్టుకుపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏడాది క్రితం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రారంభించారు. జనాలు, వాహనాలు రాకపోకలు సాగించారు. తాజాగా కురిసిన భారీ వర్షానికి వంతెన కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు ఏడు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే కాలినడకన కడెం వాగు దాటాల్సి వస్తోంది. సుమారు ఏడు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నవతెలంగాణ- పెంబి

కడెం వాగుపై నిర్మించిన వంతెన గాలివాన భీభత్సానికి కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వంతెన పై స్లాబ్ లేచిపోవడంతో వాహనాలు, మనుషులు వెళ్లలేని పరిస్థితి ఉంది. ముఖ్యంగా అత్యవసర సరుకులు, వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోలుతో పాటు పండించిన పంటలను మార్కెట్‌లో విక్రయించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో కనీసం అంబులెన్సు కూడా రాలేని పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చుట్టుపక్క ఏడు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి ఏదేని పని నిమిత్తం రావాలంటే ఖానాపూర్ నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 60కిలో మీటర్లు దూరం ప్రయాణించి వస్తే గాని మండల కేంద్రానికి చేరుకోలేని పరిస్థితి ఉంటుంది.

ఎవరిది నిర్లక్ష్యం..!

కడెం వాగు సమీపంలో హరిచంద్ తాండ సమీపంలో ఈ వంతెనకు ప్రభుత్వం రూ.168.20కోట్లు వెచ్చించింది. కానీ నిర్మించిన ఏడాదిలోపే ఇలా కూలిపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఫిల్లర్ల ఎత్తు పెంచకపోవడంతో వంతెన స్లాబ్ వరద తాకిడికి తట్టుకోలేక పోయిందని తెలుస్తోంది. ఇంజనీర్లు సరిగా అంచనా వేయలేదా..గుత్తేదారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ వంతెన కూలిపోవడం మాత్రం జనాలకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ప్రభుత్వం వినియోగించిన ప్రజాధనం వృధా అయిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం వంతెన కూలిపోయి ఉండటంతో రానున్న వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు మరింత ఇబ్బందులు ఏర్పడనున్నాయి. కనీసం కాలినడకన కూడా వాగుదాటలేని పరిస్థితి ఉండటంతో గత్యంతరం లేక 60కిలో మీటర్లు తిరిగి ప్రయాణించి చేరుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది



వంతెన కూలిపోవడంతో మండల కేంద్రానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిర్మించిన ఏడాదిలోపే గాలివానకు కొట్టుకుపోవడం శోచనీయం. ఇంజనీర్లు, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ వంతెన దెబ్బతిన్నదని తెలుస్తోంది. ప్రజల సౌకర్యార్థం వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలి.

బుక్య గోవింద్, మాజీ సర్పంచ్, పసుపుల

పంట విక్రయించడానికి కష్టాలు



వంతెన కూలిపోవడంతో హరిచంద్ తండా, పసుపుల, కొరకంటి, పసుపుల గూడెం గ్రామ రైతులు పండించిన పంట మార్కెట్‌కు తరలించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయాలి. రోడ్డు మార్గాన వెళ్లి పంటలు అమ్ముకునేందుకు సౌకర్యం కల్పించాలి.

రాథోడ్ గణేష్, రాయదారి

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచడం అభినందనీయం

- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ సీఎం కేసీఆర్ కార్మికుల దినోత్సవ సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచడం అభినందనీయమని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్మికులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్మికులకు అండగా నిలిచి వారి వేతనాలను పెంచారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, మర్సుకోల తిరుపతి, ఖాసీం, కాంతారావ్ దుర్గే, ఆడే ప్రకాష్ పంచాయతీ కార్మికులు ఉన్నారు.

గ్రామగ్రామాన ఆర్టీసీ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి గ్రామానికి ఆర్టీసీ సేవలు విస్తరించి, ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ దత్తు అన్నారు. మంగళవారం నర్సాపూర్(జి) మండలంలోని టెంబుర్ని గ్రామంలో వికలాంగులకు ఉచిత బస్‌పాస్ పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉచిత బస్ పాస్ పొందేందుకు వికలాంగ అభ్యర్థులు తమ ఆదార్ కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌లు, ఫోటోలతో సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ సిబ్బంది సుంకరి రమేష్ తెలియజేశారు.

తోటి స్నేహితునికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్ తండ్రి ఇటీవల మరణించారు. మంగళవారం విషయం తెలుసుకున్న 1991-1992 పదో తరగతి బ్యాచ్ మిత్రులందరూ కలిసి తోటి మిత్రునికి ఆర్థిక సాయంగా రూ.10వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. మిత్ర బృందం మల్లయ్య, గంగయ్య, మోహన్, లక్ష్మీరాజం, పోశెట్టి, దశరథ్‌గౌడ్, సుదర్శన్, పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ పడిగేల గంగాధర్ మిత్రులను అభినందించారు. మిత్రుని కష్టల్లో తోడుగా నిలవడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

నేడు మండలంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలో బుధవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పర్యటించనున్నట్టు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మండలకేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'విలేకరుల మీద దాడులు సరికాదు'

నవతెలంగాణ-లక్ష్మణచాంద

విలేకరుల మీద దాడులు చేయడం సరికాదని మండలం విలేకరుల అన్నారు. ఇటీవల ఖానాపూర్ మండలంలోని ఇక్బాల్‌పూర్ గ్రామ సర్పంచ్ ఓ విలేకరి మీద దాడి చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఆ సర్పంచ్‌ని వెంటనే పదవీ నుంచి తప్పించి, కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం మండల విలేకరులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పత్రిక స్వేచ్ఛను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షులు గోలి గంగాధర్, జెడ్డి మహేష్, గుజ్జరి ఈశ్వర్, వెంకటేశ్వర్ రాజు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పారిశుధ్య కార్మికులకు వేతనాలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక ఫిల్టర్ బెడ్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి కార్మికులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ హాజరై కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన సంస్కరణల తీరును వివరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏకంగా నాలుగు సార్లు కార్మికుల వేతనాలు పెంచడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. తమ సేవలను గుర్తిస్తూ వేతనాలను పెంచుతుండటం పట్ల సీఎంకి ధన్యవాదాలు తెలియచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు పారిశుధ్య కార్మికులకు కేవలం రూ.6వేల5వందల వేతనం ఉండేదని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.8వేల3వందలకు పెంచిందని అన్నారు. 2016లో పన్నెండు వేలు, 2022లో పదిహేను వేల ఆరు వందల వేతనాన్ని అందించారని తెలిపారు. తాజాగా మరో వేయి రూపాయల వేతనం పెంచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పవన్ నాయక్, ఆవుల వెంకన్న, బండారి సతీష్, సృజన్, స్వామి, శేఖర్ పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సుభాష్ నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ ఫౌజియ షబ్బీర్ పాషా ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దగ్గరి చూపు, దూరపు చూపు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను కంటి అద్దాలను అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యకమంలో వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజుర సత్యం, 7వ వార్డు కౌన్సిలర్ కిషోర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు, వార్డ్ వీడీసీ సలీం ఖాన్, వీడీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అయూబ్, గౌస్ ఖాన్ డాక్టర్లు సాలెహ తబస్సుమ్, నిఖిత, మెప్మా నారాయణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు భోదిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సొగల ప్రవీణ్ కుమార్ అన్నారు. గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం స్థానికంగా ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి సంవత్సరం త్రిసభ్య కమిటీ ద్వారా ఎంపికయ్యామని అన్నారు. ప్రభుత్వ లెక్చరర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమస్యల సాధన కోసం గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోదిస్తున్న ప్రతి సంవత్సరం గెస్ట్ లెక్చరర్లను ఆటో రెన్యూవల్ చేసి, 12నెలల పాటు కన్సోల్ డేటెడ్ వేతనం అందించి, ప్రతి నెల వేతనం చెల్లించాలని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే రేఖా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల సాధనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో గెస్ట్ లెక్చరర్లు జావిద్‌అలీ, దేవన్న, సుధాకర్, నసీర్, కార్తిక్, శ్వేతా, స్వప్న, జోహారా ఫాతిమా, రాజు ఉన్నారు.

ఎమ్మెల్యే రామన్న అధికారం కోల్పోవడం ఖాయం: శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే జోగు రామన్న బీజేపీ కార్యకర్తలపైననే కాదు తనకు ఓటేయని వారందరిపైనా కక్షగట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బేల, కొగ్దూర్‌లో సంబంధంలేని వారిపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేశారని అన్నారు. పోలీసులపై ఒత్తిడితెచ్చి మరీ సోమవారం రాత్రి అరెస్ట్ చేసి జైలుకు తరలించారని అన్నారు. మరో 5 నెలల్లో నీవు కూడా అధికారం కోల్పోవటం ఖాయమని అన్నారు. మరాఠా సమాజానికి చెందిన వారు రామన్నకు ఓట్లేస్తే వారిపైనే అక్రమ కేసులు పెట్టారని అన్నారు. అక్రమ కేసులతో ప్రజలని భయపెట్టాలనుకోవటం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు దినేష్ మటోలియ, జోగు రవి, సుభాష్, ముకుంద్, నగేష్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, సూర్య పాల్గొన్నారు.

పార్టీకి బలగం కార్యకర్తలే..

నవతెలంగాణ-ఉట్నూర్

పార్టీకి బలగం కార్యకర్తలేనని ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ పంక్షన్ హాల్‌లో మండల బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఇన్‌చార్జీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఒంటరిగా మొదలైన టీఆర్‌ఎస్ పార్టీ నేడు 60లక్షల కార్యకర్తలతో బీఆర్‌ఎస్ పార్టీగా ఏర్పడిందని అన్నారు. దేశ రాజకీయాల్లో దూసుకెళుతోందని అన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు ఇంటి గడప వద్దకు నేరుగా ప్రభుత్వం అందిస్తోందని కొనియాడారు. రాష్ట్ర రాజధానిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ రాష్ట్ర సచివాలయం, అమరవీరుల స్థూపం ఇలా అద్భుత కట్టడాలు నిర్మించిన ఘనత సీఎంఆర్ ‌‌కు దక్కుతుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దె దింపాలని అన్నారు. ఏజెన్సీలోని గిరిజన ప్రజలతో పాటుగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమంపై కేసీఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని అన్నారు. త్వరలోనే పోడు భూములకు పట్టాలు అందుతాయని, నియోజకవర్గంలోని దళితులకు దళితబంధుతో పాటుగా ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. పార్టీని బలపర్చి మన సీఎంను పీఎం చేసేంత వరకు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కందూకురి రమేష్, పీఏసీఎస్ చైర్మెన్ ఎస్పీ రెడ్డి, నాయకులు అజీమోద్దిన్, పోషన్న, స్వామి, తబిత, పోసవ్వ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు ఉన్నారు.



పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్



నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల ఆకస్మికంగా కురిసిన వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని నందిగామ గ్రామ శివారు ప్రాంతాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన నష్టపోయిన జొన్న మొక్కజొన్నపంటలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన జిల్లాలో 2800 ఎకరాల పంట నష్టం జరిగిందని తెలిపారు. నష్టపోయిన పంటల వివరాలను రెండు రోజుల్లో సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. పంటల వారిగా రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించాలని, సర్వేను వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా కల్పించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఏడి రమేష్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ వనజ, సర్పంచ్ భగీరథబాయి, ఆత్మ డైరెక్టర్ శాస్త్రి, రైతులు కేదరీశ్వర్‌రెడ్డి, సంపత్, మల్లేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్, సొసైటీ డైరెక్టర్ ప్రతాప్, భరంపూర్, నందిగామ, రేకులగూడ గ్రామాల రైతులు అధికారులు ఉన్నారు.

తాగునీటి సమస్యపరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నా ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా నాయకులు ఆరోపించారు. మంగళవారం మండలంలోని సుంగాపూర్ గ్రామంలో వారు పర్యటించారు. గ్రామస్తులు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న బావి నుంచి నీళ్లు తీసుకొని వస్తున్న దృశ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన కూడా ఇప్పటివరకు కూడా గ్రామాల్లో నీటి సమస్య ఉందనీ అన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి వరకు పర్యటించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. బావి నుంచి కరెంట్ లైన్ పైపు లైన్ ద్వారా నీళ్లు అందించేలా చూడాలని కోరారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితిని గ్రామస్తులు కోరారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు గ్రామానికి రెండు మూడు రోజులకు ఒక సారి వస్తున్నట్టు గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్, కుమురం భీం జిల్లా అధ్యక్షుడు కొట్నక్ విజయ్, ప్రధాన కార్యదర్శి పుర్కా బాపూరావ్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పారాణి, సలహాదారులు శ్యాంరావ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దాదిరావ్, రాహుల్, తుంరం సంతోష్, పెందోర్ మధు, గ్రామ పెద్దలు మడావి లచ్చు పటేల్, తుంరం దేవ్‌షావ్, మడావి జుగాదిరావ్, కొడప సుభాష్, జన్నుబాయి, చంపాబాయి ఉన్నారు.



హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

హైదరాబాదుకు సూపర్ లగ్జరీ బస్సు రామకృష్ణాపూర్ మీదుగా సోమవారం అర్ధరాత్రి 11 గంటలకు బీఆర్ఎస్ నాయకులు, జేఏసీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ కు వెళ్ళడానికి బస్ ఉండేదని కరోనా సమయంలో నిలివేసారని, తిరిగి ఆసిఫాబాద్ డిపో నుండి మందమర్రి మీదుగా ప్రతిరోజు రాత్రి 11 గంటలకు రామకృష్ణాపూర్ చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సును పట్టణ ప్రజలు, విద్యార్థులు, వ్యాపారస్తులు, వైద్య చికిత్స నిమిత్తం వెళ్లేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు జంగంపల్లి మల్లయ్య, టీడీపీ నాయకులు సంజయ్ కుమార్, సీఐటీయూ నాయకులు ఎస్.వెంకట స్వామి జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రి ఏర్పాటుచేయాలి

నవతెలంగాణ-జన్నారం



జన్నారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అప్డేట్ చేయాలని చింతగూడ గ్రామానికి చెందిన తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం మంత్రి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. మండలానికి చుట్టుపక్కల ఎక్కువగా పేద గ్రామాలు ఉండడంతో, ఆ ప్రజలకు మెరుగైన వైద్యం అందడంలేదన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి హరీష్ రావు, త్వరలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

- అసిస్టెంట్ కలెక్టర్ గౌతమి



నవతెలంగాణ-భీమిని

వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మండల సమగ్రాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ గౌతమి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సభ్యులు మండలంలో చేపట్టిన అభివృద్ధిపనులపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటులో జాప్యం తగదని అన్నారు. అంతర్గత రహదారులు, సీసీ రోడ్లు గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు మంజూరు అయిన న్యూట్రీషన్ కిట్లను అందజేశారు. అంతకు ముందు ఆమె మండలంలో బిట్టురుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోనీ రాంపూర్ హబీటేషన్‌ను సందర్శించారు. ఆ గ్రామంలో సాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి నిర్దేశించిన కొలతల ప్రాకారం కూలీలకు రూ.272 తగ్గకుండా లబ్ది చేకూరేలా చూడాలని సూచించారు. బిట్టురుపల్లి గ్రామ పంచాయతీ స్వచ్ సర్వేక్షన్‌లో ఎన్నిక కావడంతో సర్పంచ్ గడ్డం ఎల్లాగౌడ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా పాక్స్ కమిటీ చైర్మన్ నారాయణ, వైస్ ఎంపీపీ సీహెచ్ మధుకర్, ఎంపీటీసీ సభ్యులు కర్నే మమత, కొట్రంగి సంతోష్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ఆరిఫ్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీఓ షేక్ సఫ్దార్ అలీ, ఏపీఓ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిలిపేయాలి

- మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్



నవతెలంగాణ-కెరమెరి

కెరమెరి ఘాట్ రోడ్డులో ప్రమాదాలకు కారణమవుతున్న భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఘాట్ రోడ్డును సందర్శించి మూల మలుపులను పరిశీలించారు. 8 కిలోమీటర్ల ఘాట్ రోడ్డులో అనేక మూల మలుపులు ఉన్నాయని తెలిపారు. ఉట్నూర్ నుండి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం వైపు కొన్ని వందలాది ద్విచక్ర వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. సింగిల్ రోడ్డు కావడంతో చిన్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనునిత్యం కేటీసీ వాహనాలు పగలు రాత్రి తేడా లేకుండా అధిక సిమెంట్ లోడుతో రాకపోకలు కొనసాగిస్తుయని, ఈ భారీ వాహనాల వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వాహనదారులు ఇష్టారీతిన వాహనాలు నడుపుతుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భారీ వాహనాల వల్ల రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని తెలిపారు. అటు వైపుగా సంబంధిత అధికారులు వెళ్తున్న ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డురమన్నారు. ప్రమాదాల బారిన పడకుండా ప్రజలను కాపాడాలంటే భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపి వేసేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు.

సమ్మర్ చెస్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



నవతెలంగాణ-రెబ్బెన

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ చెస్ కోచింగ్ క్యాంపును ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట సుధాకర్, సంపత్ కుమార్‌లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి మైదానంలో సమ్మర్ క్యాంపు నెల రోజుల పాటు మే ఒకటో తేదీ నుండి 31వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. చెస్ వల్ల పిల్లలకు ఎంతో జ్ఞానం కలుగుతుందని, దీనివల్ల పిల్లలు మానసికంగా ధృడంగా తయారవుతారన్నారు. భవిష్యత్తులో పిల్లల కోసం మరిన్ని చెస్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోగె ఉపేందర్, కోశాధికారి కుమ్మరి మల్లేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్లరెడ్డి, కోచ్ కల్పనతో పాటు సభ్యులు శ్రీనివాస్, అరుణ్, రాజేష్ పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు రెగ్యులర్ ఉత్తర్వులు జారీ చేయాలి

- మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి





నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూనియర్ పంచాయతీ సెక్రటరీలకు రెగ్యులర్ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేస్తున్న నిరసన శిబిరంను సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీఓ ప్రకారం 11 ఏప్రిల్ 2023 నుండి సెక్రెటరీల సర్వీసులు రెగ్యులర్ చేయాలని వెంటనే దానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లడంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. పరీక్ష నిర్వహించి నియమించుకున్న సెక్రటరీలకు రెగ్యులర్ ఉత్తర్వులు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే అధికార పార్టీని నమ్మే పరిస్థితి లేదని అన్నారు. సెక్రటరీలకు అండగా ఉంటామని పునర్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ గౌడ్, కోశాధికారి ప్రదీప్‌గౌడ్, గౌరవ అధ్యక్షులు మల్లేష్, రాకేష్, ఉపాధ్యక్షులు మల్లీశ్వరి, మనీష్, వంశీ, ప్రేమ్ సాగర్, జాయింట్ సెక్రటరీలు వికాస్, తిరుపతి, శ్రీకాంత్, రవికుమార్, సభ్యులు శ్రీనివాస్, హరిదాస్, మారుతి, శ్రీజ పాల్గొన్నారు.



జన్నారంలో

జన్నారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న జేపీఎస్, ఓసీఎస్‌ల నిరవధిక సమ్మెకు మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు సంఘీభావం తెలుపుతూ వారితో పాటు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ మాట్లాడుతూ జేపీఎస్, ఓపీఎస్‌లను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఉద్యోగుల సమ్మెలతో పాలన ఫామ్ హౌస్‌లో పడకేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసివుల్ల, ముత్యం రాజన్న, ఇందయ్య, శ్రీనివాస్‌గౌడ్, దుమల్ల రమేష్, నరేష్ పటేల్, సయ్యద్ ఇమ్రాన్, హేమంత్ చారి పాల్గొన్నారు

భీమిని : మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ క్రమబద్ధీకరణకు చేపట్టిన సమ్మె ఐదో రోజు కొనసాగుతుంది. మంగళవారం బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, భీమిని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, 2018 ఎగ్జాం నోటిఫికేషన్‌లో ఉన్నట్లు 3 సంవత్సరాలు ప్రొహిబిషన్ పూర్తి చేసిన పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. వారితో పాటు మండల సర్పంచులు ఎల్లా గౌడ్, ఇందురి భూమయ్య, దుర్గం కమల, భోగ్గుల కవిత, ఎంపీటీసీలు కర్నే మమత, మధు, కోఆప్షన్ సభ్యులు ఆరిఫ్, నాయకులు బొగ్గుల రమేష్, కర్నే శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.



భీమినిలో

ఇబ్బందులు కల్గకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-హాజీపూర్

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్ నాయక్, బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎ.ప్రేమ్‌కుమార్‌తో కలిసి రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని, వేసవి దృష్ట్యా త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాలు, ఇంటర్మీడియట్ గోదాముల నుండి ధాన్యాన్ని తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం విక్రయించిన రైతులకు సంబంధిత రశీదును తప్పనిసరిగా అందజేయాలన్నారు. ధాన్యం కొనుగోలు వివరాలను ట్యాబ్లో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ట్యాగింగ్ చేసిన మిల్లులకు పంపించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040గా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. కల్లాలలోనే ధాన్యాన్ని శుభ్రం చేసి తాలు, మట్టిగడ్డలు లేకుండా నిబంధనలకు మేరకు ధాన్యాన్ని తరలించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సందర్భంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా అధికారులు చొరవ చూపాల తీసుకోవాన్నారు. ధాన్యం తడవకుండా జాగ్రతలు పాటించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన గన్నీ సంచులలో నింపాలని, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ 6303928682 నెంబర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, సందేహాలు, సలహాల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, రైసిమిలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నల్మాసు కాంతయ్య పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలి

పరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల నుండి కొనుగోలు చేసిన పరిధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం టీకనపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, తహసీల్దార్ రాజలింగుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్లు, గన్నీ సంచులను అవసరమైన మేరకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతుల సౌకర్యార్థం పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని, వేసవి దృష్ట్యా త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మార్గం రజిత పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మే డే వారోత్సవాల సందర్భంగా సీఐటీయూ దహెగాం మండల కమిటీ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను మండలకేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కో కన్వీనర్ రమేష్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1886, మే ఒకటో తేదీన అమెరిక చికాగో నగరంలోని హే-మార్కెట్‌లో 8 పని గంటల కోరుతూ లక్షలాది మంది కార్మికులు నిర్వహించిన ర్యాలీపై పోలీసులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి అనేక మంది కార్మికులను పొట్టనపెట్టుకున్నారని, ఒక పోలీసును హత్య చేశారనే అభియోగంతో కార్మిక నాయకులను ఉరితీశారని, వేలాది మందిని గాయపరిచారని, హే-మార్కెట్ ప్రాంతమంతా రక్త సిక్తమై కార్మికుల శరీరంపై ఉన్న బట్టలు రక్తంతో తడిసిపోయాయని, రక్తంతో తడిసిన బట్టలనే ఎగరవేస్తూ ర్యాలీ కొనసాగించారన్నారు. ఈ శ్రామిక వర్గం విజయానికి చిహ్నంగా 8 గంటల పని దినం చట్టబద్ధం చేయడంతో మే ఒకటిన ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్మికుల పోరాట ఫలితంగానే 8 గంటల పని దినం అమల్లోకి వచ్చిందని, దురదృష్టవశాత్తు భారత ప్రధాని నరేంద్రమోడీ కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించిన కార్మికుల హక్కులను పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చుతూ 8 గంటల పని దినాన్ని 12 గంటలు చేయడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం తిప్పికొట్టాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్మిక హకులను కాలరాసే 4 లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తున్నారాన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేసే ప్రయత్నం చేస్తున్నారి అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి, వజ్రమ్మ, జయప్రద, మమత, సవిత పాల్గొన్నారు.

నూతన బ్రాంచ్ పోస్టాఫీసు ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చొప్పన్‌గూడ గ్రామ పంచాయతీలో నూతనంగా మంజూరైన బ్రాంచ్ పోస్టాఫీసును కాగజ్‌నగర్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ సిరికొండ సతీష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా అందుబాటులో ఉన్న సేవలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దీని ద్వారా గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, ప్రతి ఒక్కరు పోస్టాఫీసు సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిడాం అన్నిగ, ఉప సర్పంచ్ జుగాజీరావు, డీపీఎం లతిక్, పోస్టుమాన్ చందు, వార్డుసభ్యులు ఆత్రం అయూబాయి, రాంబాయి, ఖానాపూర్ గ్రామ పటేల్ లచ్చు, కారోబారి సిడాం కట్టి, ఫీల్డ్ అసిసెంట్ రాథోడ్ ప్రేమ్‌దాస్, ఆశావర్కర్ మడావి జంగుబాయి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 60 శాతం బొగ్గు ఉత్పత్తి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి 60 శాతం సాధించినట్లు శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ నెలలో నిర్దేశించిన 6,26,500 టన్నుల గాను 3,73,131 టన్నులు సాధించి 60 శాతం పూర్తి చేసామని పేర్కొన్నారు. సుశి హైటెక్ కంపెనీ కాలపరిమితి ముగియడంతో బొగ్గు ప్రతి శాతం తగ్గిందని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఏప్రిల్ నెలలో 49 మంది కారుణ్య నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే మెరిట్ స్కాలర్షిప్, రామచంద్ర మిషన్ ద్వారా యోగ కార్యక్రమాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. శ్రీరామ్ పరి ఏరియాలో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, అలాగే 60 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇంఛార్జి ఎస్ఓ టు జీఎం గోపాల్ సింగ్, డీజీఎం(పర్సనల్) అరవింద రావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఆర్కే-5,6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, సీనియర్ పిఓ కాంతారావు పాల్గొన్నారు.

కుల వృత్తులకు తీరని అన్యాయం

- మాజీ ఎంపీ రాథోడ్ రమేష్



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు తీరని అన్యాయం చేస్తుందని మాజీ ఎంపీ బీజేపీ నేత రాథోడ్ రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో పలువురు వడ్డెర సంఘ నాయకులకు బీజేపీ ఖండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కుల వృత్తులను ధ్వంసం చేసి, పేదలను నిరుపేదలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని, దొరల రాజ్యంగా మారుస్తున్నారని మండి పడ్డారు. వచ్చే ఎన్నికల్లో అన్ని కులాల వారు కేసీఆర్‌కు తగిన గుణ పాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన్నారం మండల అధ్యక్షులు గోలి చందు, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మధుసూదన్ రావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీర భద్రి నాయక్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు బోడ తిరుపతి నాయక్, తపాల్ పూర్ శక్తి కేంద్ర ఇన్‌చార్జి కొమురయ్య, బండి రాజన్న, ఐటి సెల్ అసెంబ్లీ కో కన్వీనర్ బుర్రగడ్డ జగన్, బీజేపీ నాయకులు గూడ గంగాధర్, శంకర్, వెయ్యికండ్ల రవి, శివలింగు, పవన్ యాదవ్ పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ, కిడ్నీ వ్యాధిపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిపై శ్రీరాంపూర్ ఏరియా వైద్య ఆరోగ్య విభాగం అధికారి డాక్టర్ లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వడదెబ్బ నివారణ, కిడ్నీ వ్యాధిపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండలం కారణంగా వడదెబ్బ తగలకుండా కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ప్రతి రోజు నీరు ఎక్కువ తీసుకోవడం, పండ్ల రసాలు, ద్రవ రూపంలో ఆహారం తీసుకోవడం వలన మూత్ర పిండాలు సక్రమంగా పనిచేస్తాయిని తెలిపారు. రోజులో కనీసం 3 నుండి 5 లీటర్లు నీరు తాగాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం వ్యాధి గ్రస్తులు, అధిక బరువు కలిగిన వారు కుటుంబ సభ్యులు ప్రతి ఆరు మాసాలలో ఒక మారు మూత్రపిండాల పరీక్ష చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్క కార్మికుడు వ్యక్తిగత జాగ్రత్త తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆర్కే-7 గని ఇన్‌ఛార్జి మేనేజర్ రవి శంకర్ మాట్లాడుతూ డాక్టర్ సలహాలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని అన్నారు. మద్యపానం, ధూమపానం, మాంసాహారం అతిగా సేవించరాదని, కూరగాయలకు, పండ్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని ప్రతి ఒక్క కార్మికుడు తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఫిట్ సెక్రెటరీ మెండే వెంకటి, ఏరియా సెక్రటరీ అశోక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రౌతు సత్యనారాయణ, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకటరామ్, రవితేజ, ఇంజనీర్లు రమేష్, సుధీర్‌రెడ్డి, గని వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు ప్రణయ్, మోహన్, అఖిల్ పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలో 17.5 ఎకరాలు పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఏఓ దేవులపల్లి వందన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దివ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-సారంగాపూర్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా ఒకనినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో ఫోటో రూపంలో తమ ఆనందాన్ని పదిలపర్చుకున్నారు. అనంతరం ఫోటోలు దిగి ఆనందించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నాగచారి, విద్యసాగర్, ఉపాధ్యాయులు శేషాద్రి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యం కొనుగోలు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాచపూర్ గ్రామంలో పర్యటించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో నేటికీ కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించకపోవడం దారుణమన్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన వరి, మొక్కజొన్న, నువ్వు, జొన్న, మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరి వెంట నాయకులు భూమన్న, ఆనందం, సాయన్న, మండల అధ్యక్షులు భూషణం పాల్గొన్నారు.

మహాసభలకు బయల్దేరిన నాయకులు, కార్యకర్తలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భద్రాచలంలో 3,4,5,6 తేదీల్లో జరిగే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, రాష్ట్ర మూడవ మహాసభలకు ఆదిలాబాద్ టీఏవీఎస్, టీఏజీఎస్ నాయకత్వం బయలు దేరింది. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా నుండి 100 మంది బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బైరి సోమేశ్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ, స్వయం పాలన ఆదివాసీ హక్కుల సాధనకు టీఏజీఎస్ పోరాడుతోందన్నారు. ఆదివాసీ చట్టాల పరిరక్షణ, ఆదివాసీ హక్కుల అమలు వారి సమస్యలపై మహాసభల్లో చర్చించి పోరాట రూపకల్పన చేస్తామన్నారు. ఈ మహాసభలకు జాతీయ నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు హాజరువుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆత్రం కిష్టన్న, రాజు, పుష్ప, సంతోష్, గణేష్ ఉన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-నిర్మల్

విద్యుత్ భద్రతా వారోత్సవాలలో భాగంగా జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడారు. ఎలక్ట్రికల్ లైన్ పనులు జరుగుతున్నప్పుడు భద్రతపరమైన జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో సెక్షన్ల వారీగా సిబ్బందికి సెమినార్లు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడంలో, నివారణ చర్యలు ఎలా తీసుకోవాలో అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సరైన భద్రతాపరమైన జాగ్రత్తలు లేకపోవడంతోనే విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది ఉన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గోరక్‌పూర్ వైపు వెళ్ళే రైలు నుంచి బీహార్‌కు చెందిన ఎండీ అబ్దుల్లా(18) ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్టు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతుని బంధువుల ఆచూకి నిమిత్తం సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించి మృతదేహాన్ని బద్రపరచినట్టు తెలిపారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నస్పూర్



మున్సిపాలిటీ పరిధిలోని 18, 21 వార్డులో నిర్మిస్తున్న కల్వర్ట్ పనులను మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పరిశీలించారు. అనంతరం పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో త్రాగునీరు ట్యాంకర్ల ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని 25వ వార్డులో చేపట్టిన కంటివెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని, అందత్వ నివరారణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అదే విధంగా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి స్థలాల్లో గత 30 సంవత్సరాలుగా నివాసముంటున్న 520 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, తహసీల్దార్ జ్యోతి, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, నస్పూర్ మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, టీబీజీకేఎస్ నాయకులు సురేందర్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, కౌన్సిలర్లు బండి పద్మ, మల్లయ్య, బెడిక లక్ష్మి, పూదరి కుమార్, చిడం మహేష్, తెనుగు లావణ్య, మేకల దాసు, బేర సత్యనారాయణ, వంగ తిరుపతి, పట్టణ కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు రఫీక్ ఖాన్, భౌతు వెంకటేష్ పాల్గొన్నారు.

నస్పూర్‌లో పట్టపగలే భారీ దొంగతనం

నవతెలంగాణ-నస్పూర్

సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తీగల్‌పహాడ్, లక్ష్మి ఎంక్లేవ్ నివాస సముదాయంలో మంగళవారం పట్టపగలే భారీ దొంగతనం జరిగింది. బాధితుడు బాకం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం..వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లారు. రమేష్ సైతం పని నిమిత్తం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం 3గంటలకు వచ్చాడు. తలుపు తెరిచి ఉండడంతో ఇంట్లో దొంగలు పడ్డారన్న విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాడు. ఇంట్లోని బీరువాలో ఉన్న 15 లక్షల నగదు, 21 తులాల బంగారం, 40 గ్రాముల వెండి దొంగలు అపహరించారు. బాధితుడు ప్రముఖ వ్యాపారి కావడంతో భారీగా నగదు, బంగారం దొంగలకు దొరికిందని స్థానికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ బృందాలు ఆధారాలను సేకరించాయి. మంచిర్యాల డిసిపి సుధీర్ రాంనాద్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ టి.సంజీవ్, ఎస్సై రవికుమార్, సీసీఎస్ ఎస్ఐ రాజబాబు, కొమురయ్య, క్రైమ్ బ్రాంచ్, పోలీసు బృందాలు సందర్శించాయి. దొంగతనానికి పాల్పడిన వారికోసం పోలీసు బృందాలు గాలింపు మొదలుపెట్టాయి.

అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బహిర్గతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దళితబంధులో 30శాతం కమిషన్ తీసుకోని దళితులను డబ్బుల కోసం పీక్కుతినే బీఆర్ఎస్ అవినీతి ఎమ్మెల్యేల పేర్లను సీఎం కేసీఆర్ బహిర్గతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి డీసీసీ ప్రెసిడెంట్ నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ వర్గాల అభ్యున్నతి జరుగుతుందని కళలు కన్నామని అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రజల కళలు సీఎం కేసీఆర్ నాయకత్వంలో కల్లలుగానే ముగిలిపోయాయని ఎద్దేవా చేశారు. దళితబంధు పథకంలో ప్రతి ఒక్కరి నుండి రూ.10లక్షలకు రూ.3లక్షల కమీషన్ వసూలు చేస్తున్నారని సాక్షాత్ సీఎం కేసీఆర్ ఆరోపించడం విచిత్రంగా ఉందని అన్నారు. దళితబస్తీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో కూడా పెద్ద ఎత్తున డబ్బులు కమీషన్‌ల రూపంలో చేతులు మారాయని అన్నారు. ఇలా ప్రతి సంక్షేమ పథకాలలో ప్రజల నుండి కర్కశంగా డబ్బులు వసూలు చేసిన ఎమ్మెల్యేల పేర్లను దమ్ముంటే సీఎం కేసీఆర్ బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దళితబంధు, అనేక సంక్షేమ పథకాలలో ఎమ్మెల్యేలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటే అవినీతి చేశారని సాక్షాత్తు సీఎం కేసీఆరే ఆరోపిస్తే, మరి అవినీతి చేసిన ఎమ్మెల్యేల పేర్లు ఎందుకు బయట పెడుతలేరో రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఇన్‌చార్జ్ సెడ్మాకే ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ పనులు వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలో ఆర్ అండ్ బీ శాఖ చేపట్టే పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆర్ అండ్ బి, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలో అండర్, ఓవర్ రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి రూ.97.2 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. స్థానిక తాంసి బస్ స్టాండ్ వద్ద నిర్మించనున్న రైల్వే అండర్ బ్రిడ్జి, అలాగే ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పనుల ప్రారంభానికి చర్యలను వేగవంతం చేయాలని అన్నారు. భూ సేకరణ, పుట్‌పాత్ నిర్మాణం వంటి పనులను చేపట్టేందుకు రెవెన్యూ, మున్సిపల్, రోడ్లు భవనాలు, రైల్వే అధికారులు సమన్వయంతో పనులు నిర్వహించాలని సూచించారు. సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించి రూ.55కోట్ల రూపాయలు పరిపాలన అనుమతులు మంజూరు అయ్యాయని, పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కేఆర్కే కాలనీ, మావల సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు త్వరలోనే లబ్ధిదారులకు కేటాయించనున్న నేపథ్యంలో మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎన్.నటరాజ్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజ, ఆర్ అండ్ బి ఈఈ నర్సయ్య, ఆర్డీఓ రమేష్ రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శైలజ, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, రాజేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడ్డ దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తాళం వేసి ఉన్న ఇళ్లను, ఆలయాలను టార్గెట్ చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను మంగళవారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఉమేందర్ వెల్లడించారు. న్యూహౌసింగ్ బోర్డులో నివాసముండే మహ్మద్ మోయిజ్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నతనం నుండే జల్సాలకు అలవాటు పడ్డ మోయిజ్ చోరీలు చేయడం మొదలుపెట్టాడు. ఇతనిపై గతంలో ఎన్నో కేసులు నమోదయ్యాయి. జైలు నుండి విడుదలై వచ్చిన తర్వాత కూడా మార్పు రాలేదు. ఇటీవల పట్టణంలో పలుచోట్ల తాళాలు వేసి ఉన్న ఇండ్లు, దేవాలయాలను ఎంచుకుని బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదును దోచుకెళ్లాడు. మరో ఇద్దరితో కలిసి ఇదే పనిగా వరుస చోరీలకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఎట్టకేలకు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం 10గంటల సమయంలో దస్నాపూర్ తిరుమల పెట్రోల్ పంప్ దగ్గర తిరుగుతున్నాడని వచ్చిన సమాచారం మేరకు మావల పోలీసులు మకాం వేశారు. చాకచక్యంగా పోలీసులు అతన్ని పట్టుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. మరో ఇద్దరు పరారీలో ఉండడంతో వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చాటిన పోలీస్ సిబ్బందికి రివార్డులు అందజేసి అభినందించారు. మీడియా సమావేశంలో రూరల్ సీఐ రఘుపతి, మావల ఎస్ఐ విష్ణువర్ధన్ ఉన్నారు.

వరి ధాన్యం కోనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు

నవతెలంగాణ - కాగజ్‌నగర్



వరి కొనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు చేపట్టినట్టు అడిషనల్ కలెక్టర్ (పౌరసరఫరాలశాఖ) రాజేశం తెలిపారు. మంగళవారం వంజీరి రైతు వేదికలో వరి ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్(సొసైటీ) శాఖకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. 17శాతం కంటే తక్కువ తేమ ఉండాలని, సాధారణ వరి ధాన్యానికి కనీస మద్దతు రూ.2040 ఉందని తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఏఈఓలు తప్పనిసరిగా ఉండి తేమ శాతం ఎంత ఉందని పరిశీలించాలని సూచించారు. రైతులకు ముందుగా సంచులను ఇవ్వకూడదని హెచ్చరించారు. సెంటర్ వద్ద టార్పాలిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తాలు, తప్పు లేని మంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, డీఎస్ఓ తారామణి, డీఎం గోపాల్, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చిలువేరు సత్యనారాయణ, ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ, వివిధ మండలాల ఏఓలు, ఏఈఓలు, రైస్ మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్రభారతిలో మే డే వేడుకల్లో తెలంగాణ ప్రభుత్వం ద్వారా శ్రమశక్తి అవార్డు పొందిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జీఎం కమిటీ సభ్యులు పెట్టం లక్ష్మణ్, ఆర్కే5 మైనింగ్ సర్దార్లు పానుగంటి సత్తయ్య, శ్రీనివాసరావును జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రమశక్తి అవార్డు పొందిన వారు అభినందనీయులని, వారు అందించిన సేవలకు గుర్తింపుగా అవార్డు రావడం చాలా సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓ టు జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ రమేష్ బాబు, డిజిఎం(ప) అరవిందరావు, డిజిఎం (ఐఈడి) చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ శ్రీధర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, డివైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ పిఓ కాంతారావు, కార్యాలయ పిట్ కార్యదర్శి పివి రావు పాల్గొన్నారు.

ఆర్కే-6 గనిలో సన్మానం

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా జీఎం చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, బ్రాంచ్ సెక్రటరీ పానుగంటి సత్తయ్య మంగళవారం ఆర్కే6 గనిలో ఆర్కే5,6 గనుల గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ ఇ.తిరుపతి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, గని అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ఇప్ప భూమయ్య, ఏరియా జీఎం కమిటీ సభ్యులు వెంగల కుమారస్వామి, దొమ్మటి పోశెట్టి, ఏరియా నాయకులు అడ్డు శ్రీనివాస్, పొగాకు రమేష్, గొర్ల సంతోష్, అన్వేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులను కించ పరిచేలా మాట్లాడటం నేరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వికలాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ పోస్టర్లను ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆదిలాబాద్ పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చేత పోస్టర్లను సంఘం నాయకులు విడుదల చేయించారు. అనంతరం డీఎస్పీ ఉమెందర్‌ను కలిసిన సంఘం నాయకులు పోస్టర్లను విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ 92 ప్రకారం దివ్యాంగులను కించ పరిచేలా మాట్లాడటం నేరమని అన్నారు. అవమానించిన, మానమర్యాదలకు భంగం కలిగించిన పెత్తనం చేసిన, మోసం చేసిన, దాడి చేసిన వారికి సాక్షులు సాక్షాదారులతో పని లేకుండా 6 నెలల నుండి 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు భారీ మొత్తంలో జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ సలీం, పట్టణ అధ్యక్షులు చందావర్ రాకేష్, గౌరవ అధ్యక్షులు ఆకుల సునీల్ కుమార్, దివ్యాంగుల ఎంప్లాయ్ యూనియన్ ప్రెసిడెంట్ ఆడప నారాయణ, జిల్లా వికలాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంకననేని సుకుమార్, ఉపాధ్యక్షులు అమన్ ఉల్లాఖాన్, బంక రాజశేఖర్, బండి నందు, జాయింట్ సెక్రటరీ మేకల రమేష్, చిలుకూరి మహేందర్ రెడ్డి ఉన్నారు.



నవతెలంగాణ కథనానికి స్పందన

- పంటపొలాల్లోని విద్యుత్ తీగలను పరిశీలించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే



నవతెలంగాణ-బేల

నవతెలంగాణలో ఇటీవల ప్రచురితమైన ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు అనే శీర్షికకు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే స్పందించి, రైతుల పంటపొలాల్లోని విద్యుత్ తీగలను పరిశీలించారు. మంగళవారం మండలంలోని మొహబత్‌పూర్ శివారులోని సబ్ స్టేషన్ బేల, దహేగావ్ ఫీడర్ పరిధిలోని బేదొడ్కర్ జితేందర్, మారుతీ ఖోడే రైతుల పంట పొలాల్లో 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వంగి విద్యుత్ స్తంభాలు పడిపోయే విధంగా ఒక పక్కకు వంగిపోయి ఉన్న విషయాన్ని నవతెలంగాణ పత్రికలో "ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు" అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే మంగళవారం రైతుల పొలాల వద్దకు వచ్చి పరిస్థితిని గమనించి, జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు భేదొడ్కర్ జితేందర్, ఉపసర్పంచ్ బేదొడ్కర్ దిలీప్, అనిల్, విద్యుత్ శాఖ సిబ్బంది మనోహర్, జమ్ము ఉన్నారు.

పాఠ్యపుస్తకాల గోదామును పరిశీలించిన డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గోదాములను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత పరిశీలించారు. జిల్లాకు 6,51,580 పుస్తకాలు రావాల్సి ఉండగా నేటికి 2,76,185 పుస్తకాలు మాత్రమే వచ్చాయని, వాటిని గోదాములో నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా 3,75,395 పాత పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ముఖ్యంగా ప్రాథమిక తరగతి పుస్తకాలు రాలేనందున అవన్నీ వచ్చిన వెంటనే వివిధ మండలాలకు సరఫరా చేయనున్నట్టు పేర్కొన్నారు. గోదాములలో నిల్వ చేసే పాఠ్యపుస్తకాల రక్షణకు అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. డీఈఓ వెంట ఏడీ నర్సిములు, సెక్టోరల్ అధికారి సుజాత్‌ఖాన్, పాఠ్య పుస్తకాల మేనేజర్ నూటెంకి సత్యనారాయణ, డీఈఓ సీసీ రాజేశ్వర్ సందర్శించారు.

సబ్సిడీలు కార్పొరేట్లకు కాదు.. ప్రజలకు ఇవ్వండి

నవతెలంగాణ-నిర్మల్

సబ్సిడీలు కార్పొరేట్లకు కాదు.. ప్రజలకు ఇవ్వాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేయాలని కోరారు. డీజిల్, పెట్రోల్ ధరలతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ పాలనకు ముందు రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ.1200కు చేరిందన్నారు. రాష్ట్రప్రభుత్వం అర్హులైన వారందరికీ వెంటనే రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, ఎండీ గఫూర్, ఎస్.గంగన్న, పీవోడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీ, జమున, అరుణ, నర్సవ్వ, భీమవ్వ, కవిత, పద్మ, జ్యోతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.42వేలు జరిమానా

నవతెలంగాణ-నిర్మల్

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 35 మంది వాహనదారులకు మంగళవారం నిర్మల్ ద్వితీయశ్రేణి కోర్టు న్యాయమూర్తి రూ.42వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 35మందిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, ఆయన రూ.42వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

హాకీ క్రీడా వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవికాలంలో సెలవులను వృధా చేసుకోకుండా క్రీడాకారుల కోసం ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా క్రీడా మండలి ఆధ్వర్యంలో నిర్వహించే హాకీ క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఒలంపిక్, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు జరిగే హాకీ శిక్షణ శిబిరాన్ని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలూరి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో పిల్లలు సమయాన్ని వృధా చేసుకోకుండా, చెడు అలవాట్లకు బానిసకాకుండా ఈ శిక్షణ శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడాలలో, 16 కేంద్రాలలో ఈ వేసవి శిక్షణ శిబిరాలు జరుగుతున్నట్లు తెలిపారు. వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, పలువురు పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని కనకపూర్ గ్రామానికి చెందిన విలేకరి రాజాగౌడ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మంగళవారం స్థానిక సర్పంచ్ సుక్కు రాజవ్వ ముత్తన్న బాధితునికి ఇంటికి వెళ్లి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని అధైర్యం పడొద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్, సత్యనారాయణ, పోతన్న పాల్గొన్నారు.

మతం మారితే రిజర్వేషన్లు రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మతం మారిన గిరిజనులకు రిజర్వేషన్లు వర్తింపజేయకుండా చట్టం తీసుకురావాలని జనజాతి సురక్ష మంచ్ జిల్లా కన్వీనర్ మెస్రం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం మారిన గిరిజనుల రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనజాతి సురక్ష మంచ్ సభ్యులు తోడసం అజయ్, మర్సకొల కేశవ్, వినాయక్ రావు పాల్గొన్నారు.